క్లుప్తంగా

280మందిని కాపాడిన కాజీపేట పోలీసులు



కాజీపేట: కాజీపేట మండలం దర్గా కాజీపేట శివారులోని ఇందిరనగర్ కాలనీ పూర్తిగా నీట మునిగిపోవడంతో దాదాపు 280 మంది 12గంటలపాటు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దర్గా చెరువు బ్యాక్ వాటర్‌తో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలనీ పూర్తిగా నీట మునగడంతో భవనాల పైకి ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ తన సబ్ డివిజన్‌కు చెందిన సిబ్బందితో కలిసి మత్స్యకారుల సహాయంతో భవనాల వద్దకు నాటు పడవల్లో చేరుకుని అందరిని రక్షించి ఓ ఫంక్షన్ హాల్‌లో వసతి సౌకర్యం కల్పించారు. స్థానిక సీఐ సార్ల రాజు ఆధ్వర్యంలో బాధితులందరికి పోలీస్ సిబ్బంది రాత్రి భోజన ఏర్పాట్లు చేశారు.

కేయూ బైపాస్ రోడ్డులో ట్రాఫిక్



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ బైపాస్ రోడ్డులో వాహనదారులకు కష్టాలు తప్పలేదు. బుధవారం కురిసిన భారీ వర్షానికి పెద్దమ్మగడ్డ సమీపంలోని ప్రధాన నాలా ఉప్పొంగడంతో రోడ్డుపై వరద నీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. సమీపంలోని కాకతీయకాలనీ, జ్యోతిబసునగర్, లోటస్‌కాలనీ, జ్యోతిరావుపూలే కాలనీల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

నగరవాసులను ఆదుకోవాలి

వరంగల్: వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. ప్రకృతి వైపరీత్యాలతో అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రభుత్వం సత్వరమే స్పందించి డ్రెయినేజీలను శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు.

మెరుగైన విద్యకు ఎన్ఈపీ -20 తోడ్పాటు

కాజీపేట అర్బన్: విద్యార్థులకు కాలానుగుణంగా మెరుగైన విద్యనందించేందుకు న్యూ ఎడ్యుకేషనల్ పాలసీ -2020 తోడ్పడుతుందని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మృదుల తెలిపారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని కేవీ పాఠశాలలో ఎన్ఈపీ -2020పై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రినిపాల్ మృదుల పాల్గొని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్ఈపీ -20ని కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ పూర్ణిమ తెలిపారు.

ఏడేళ్ల తర్వాత కుటుంబ సభ్యుల చెంతకు..



కాజీపేట అర్బన్: ఏడేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన తన చెల్లి చనిపోయిందనుకున్నానని, కానీ ఏడేళ్ల తర్వాత తమ వద్దకు వచ్చిందని ఆమె అన్న ఆనందం వ్యక్తం చేశాడు. సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ హైమావతి, కేస్ వర్కర్ వినీల తెలిపిన కథనం ప్రకారం హనుమకొండ చౌరస్తాలోని హనుమాన్ దేవాలయం వద్ద ఒంటరి మహిళ.. మూడు నెలల పాపతో కొంత కాలంగా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు ఈనెల 25న సఖి వన్‌స్టాప్ సెంటర్ టోల్‌ఫ్రీ నంబర్ 181కు సమాచారం వచ్చింది. దాంతో అధికారులు ఆరా తీయగా ఆ మహిళ సూర్యాపేట జిల్లా కోదాడలోని నారాయణగూడెం గ్రామానికి చెందినట్లు గుర్తించారు. కోదాడ పోలీసుల సాయంతో ఆ మహిళను ఆమె అన్నయ్యకు అప్పగించారు.

విద్యుదాఘతంతో వ్యక్తి మృతి

కాజీపేట: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమృత థియేటర్ సమీపంలో విద్యుత్ వైర్లు తెగి కిందపడడంతో ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై గురువారం మృతి చెందాడు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం రాగన్న దర్వాజ కాలనీకి చెందిన ఊట్ల పరమేశ్వర్ (37) అనే వ్యక్తి రహదారిపై నడుస్తుండగా విద్యుత్ వైర్లు ప్రమాదవశాత్తు తెగి అతని మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

కరీమాబాద్: కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోని గదుల తాళాలు పగులగొట్టి 10 ఫ్యాన్లు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఈ సందర్భంగా పాఠశాలను కార్పొరేటర్ మరుపల్ల రవి గురువారం సందర్శించి ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చోరీ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



ములుగు రోడ్డు జంక్షన్‌లో వరద ప్రవాహం

నగరాన్ని ముంచెత్తిన వరద

ఇటీవల వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు భారీగా పోటెత్తి నగరాన్ని ముంచెత్తింది. దాంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు నీట మునిగాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సహాయక చర్యలు చేపట్టి వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పిస్తున్నారు. బాధితులకు దాతలు భోజన సదుపాయాలు కల్పిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నయీంనగర్‌లో ఉప్పొంగి ప్రవహిస్తున్న వరదలో చిక్కుకున్న అంబులెన్స్



గుండ్లసింగారం చుట్టూ చేరిన వరద



హంటర్ రోడ్డు వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిలిచిన వరద నీరు



అలంకార్‌లో జంక్షన్‌లో నిలిచిన వరద నీరు



వరంగల్ మధురానగర్ కాలనీని ముంచెత్తిన వరద నీరు



కాకతీయ యూనివర్సిటీ రోడ్డు కొత్తూర్ జెండా నాలా బ్రిడ్జిపై స్తంభించిన ట్రాఫిక్



శివనగర్‌లో ఓ ఇంటిని చుట్టుముట్టిన వరద



వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న బల్దియా సిబ్బంది



శివనగర్‌లో రోడ్డుపై పారుతున్న వరద



ఖమ్మంరోడ్డులో ప్రమాదకరంగా ఉన్న రహదారి



మత్తడి పోస్తున్న భద్రకాళి చెరువు

అధైర్య పడకండి.. అండగా ఉంటాం



కిషన్‌పురలో వరద నీటిలో పర్యటిస్తున్న చీఫ్‌విప్



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న రావు పద్మ



సహాయక చర్యలు చేపట్టిన ఏనుగుల రాకేష్‌రెడ్డి

హన్మకొండ: భారీ వర్షం, వరదలను చూసి ప్రజలు అధైర్యపడొద్దని, తాను అండగా ఉంటానని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ భరోసా ఇచ్చారు. హనుమకొండలోని ముంపు ప్రాంతాల్లో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌తో కలిసి గురువారం పర్యటించారు. వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారి ఇళ్ల వద్దకే ఆహార పదార్థాలను పంపించారు. ముంపు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసేలా అధికారులను ఆదేశించారు. ఆపద తలెత్తితే 1800 425 1980, 97019 99645 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి వడ్డెపల్లి చెరువును సందర్శించారు. బీఆర్ఎస్ పార్టీ 61వ డివిజన్ అధ్యక్షుడు రామరాజ్ ఇల్లు వర్షానికి కూలిపోగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీపీ కిరణ్ కుమార్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హన్మకొండ: భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. హనుమకొండలోని ముంపు ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ముంపు బాధితులను పద్మ ఓదార్చారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు.

మానవ తప్పిదంతోనే ముంపు

హన్మకొండ: మానవ తప్పిదం వల్లనే కాలనీలు ముంపునకు గురయ్యాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి విమర్శించారు. భద్రకాళి బండ్ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ముంపు ప్రాంతాలైన రామన్నపేట, పోతన నగర్‌లలో రాకేష్‌రెడ్డి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా సహాయక చర్యలు చేపట్టారు. ముంపు బాధితులకు ఆహార పొట్లాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదమే భద్రకాళి బండ్ గండికి ప్రధాన కారణమన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

నయీంనగర్: 6వ డివిజన్‌లోని ముంపు ప్రాంతాలను కార్పొరేటర్ చెన్నం మధు పరిశీలించారు. బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆపదలో అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం వారికి భోజన ఏర్పాట్లు చేశారు.

వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

హన్మకొండ: భారీ వర్షంతో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తాయి. ఈదురుగాలులకు పలు చోట్ల విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పలు చోట్ల చెట్లు కూలడంతో విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. వర్షంతోపాటు ఇతర సమస్యలు తలెత్తడంతో కొన్ని ప్రాంతాల్లో బుధవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరికొన్ని ప్రాంతాల్లో ఉదయం 3 గంటల నుంచి సరఫరా నిలిచిపోయింది. గురువారం సాయంత్రం వరకు నగరంలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక ఫీడర్లలో సమస్యలు ఉత్పన్నం కాగా, కొన్నింటిని బాగు చేసి సరఫరా పునరుద్ధరించారు. శుక్రవారం అన్నింటిని బాగు చేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.



గోపాల్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి చేరిన నీరు

శివనగర్‌లో అంధకారం

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో అంధకారం నెలకొంది. వరద ముంపునకు గురైన శివనగర్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దాంతో బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి 7గంటల వరకు విద్యుత్‌ను పునరుద్ధరించలేదు.

భారీ వర్షంతో రవాణాకు ఆటంకం

హన్మకొండ: భారీ వర్షంతో వాగులు, వంకలు పొంగిపొర్లడం, చెరువులు మత్తళ్లు పోయడం, రహదారుల నుంచి వరద నీరు ప్రవహించడంతో రవాణాకు ఆటంకం ఏర్పడింది. వంతెనలు, కల్వర్టుల పైనుంచి వరదనీరు ప్రవహించడంతో పాటు పలు చోట్ల రోడ్డు తెగిపోవడంతో ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలు అన్ని నిలిచిపోయాయి. వరంగల్ రీజియన్‌లోని 9డిపోల పరిధిలో రోజుకు 850 షెడ్యూలు తిరుగుతుంటాయి. వర్షంతో 75 శాతానికి పైగా బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు గ్రామాలకు సైతం బస్సులు నిలిచిపోయాయి. హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం నుంచి హైదరాబాద్ ఉప్పల్, జనగామ, పాలకుర్తి రూట్లలో మాత్రమే బస్సులు నడిచాయి. పెద్దమ్మగడ్డ నుంచి నుంచి పరకాల వరకు, వరంగల్ నుంచి నర్సంపేట వరకు మాత్రమే బస్సులు తిరిగాయి. హనుమకొండ నయీంనగర్, హసన్‌పర్తి చింతగట్టు వద్ద భారీగా వరదనీరు చేరయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దాంతో కరీంనగర్, నిజామాబాద్, సిద్దిపేట, వేములవాడ ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు నిలిపోయాయి. బస్సుల నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కరీంనగర్ వెళ్లే ప్రయాణికుల అవస్థలు గమనించిన ఆర్టీసీ అధికారులు.. ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి రింగ్ రోడ్డు ద్వారా పంపించారు. బస్సుల నిలిపివేతతో వరంగల్ రీజియన్‌లో ఆర్టీసీ సుమారు రూ.కోటి ఆదాయాన్ని కోల్పోయింది.



హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో ప్రయాణికులు

పాలకుల నిర్లక్ష్యంతోనే ముంపు

కరీమాబాద్: వరంగల్ నగరంలోని నాలాలలోని పూడికను తీయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే నగరంలోని పలు ప్రాంతాలు వరద ముంపునకు గురవుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ బాబు ఆరోపించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు డివిజన్లలోని లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో బాధిత ప్రజలను పునరావాస కేంద్రాలకు గురువారం తరలించారు. ఈ సందర్భంగా వారికి భోజనం అందజేసి ఆయన మాట్లాడారు. అధికార పార్టీ ఎమ్మెల్యే, మేయర్‌ల మధ్య సయోధ్య లేకపోవడంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వరంగల్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, రఘునారెడ్డి, శ్యాంసుందర్, దీన్‌దయాన్, మురళీకృష్ణ, ఓంప్రకాశ్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే కారణం

కాశిబుగ్గ: నగరంలోని పలు కాలనీలు ముంపునకు కారణం కావడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆరోపించారు. నీట మునిగిన 19వ డివిజన్ గాంధీనగర్‌లో బీజేపీ నాయకులతో కలిసి గురువారం పర్యటించి ప్రజలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ గత రెండేళ్లుగా వానలకు నగరం ముంపునకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఎలాంటి పనులు చేపట్టలేదని వాపోయారు. బీజేపీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మంతెన అమరీష్, రంజిత్, చందు, నాయకులు ఉన్నారు.

తహసీల్దార్లకు పదోన్నతులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో 81మంది తహసీల్దార్లకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా (ఎస్‌డీసీ) పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన వారిలో హనుమకొండ జిల్లా నుంచి ప్రస్తుతం కలెక్టరేట్ ఏఓగా పనిచేస్తున్న కిరణ్‌ప్రకాష్, పరకాల ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఉమారాణి, వరంగల్ జిల్లా నుంచి శ్రీరాములు, డీఎస్ వెంకన్న ఉన్నారు.

వరంగల్ మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 28నుంచి 30వ తేదీ వరకు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల కారణంగా చాంబర్ ఆఫ్ కామర్స్ విజ్ఞప్తి మేరకు శుక్రవారం సెలవును ప్రకటించగా, 29న మొహర్రం పండుగ, 30న ఆదివారం కావడంతో సాధారణ సెలువులు వరుసగా మూడు రోజులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ మూడు రోజులు మార్కెట్‌లో ఎలాంటి క్రయవిక్రయాలు జరగవని, సోమవారం తిరిగి మార్కెట్‌లో లావాదేవీలు జరుగుతాయని తెలిపారు.

ఎస్సీ ఉమెన్స్ హాస్టల్‌ను సందర్శించిన డాక్టర్ వెంకటరమణ



ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

ఖిలా వరంగల్: వరంగల్ హంటర్‌రోడ్డు రంగశాయిపేటలోని ఎస్సీ ఉమెన్స్ వసతిగృహాన్ని వరంగల్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వేడి ఆహారం తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. ఏదైనా సమస్య తలెత్తితే 1800 3253 424, 91542 52936 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యార్థినులకు ధైర్యం చెప్పిన ఎస్సై

వరంగల్: ఆరెపల్లి సమీపంలోని జ్యోతిబాపూలే బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో వరద నీరు నిలిచింది. ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఎస్సై రాజన్‌బాబు అక్కడికి వెళ్లి విద్యార్థులకు ధైర్యం చెప్పారు.

కేయూలో సమర రిలే దీక్షలు షురూ



దీక్షలో మహిళా కాంట్రాక్టు అధ్యాపకులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయాలని కాకతీయ యూనివర్సిటీలోని మహిళా కాంట్రాక్టు అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈమేరకు క్యాంపస్‌లోని పరిపాలన భవనం ఎదుట సమర రిలే నిరాహార దీక్షలను గురువారం చేపట్టారు. దీక్షను కేయూ ఫార్మసీ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ సారంగపాణి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అనేక సంవత్సరాల నుంచి కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయాలనే డిమాండ్ న్యాయమైనదని అన్నారు. దీక్ష చేపట్టిన వారికి కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. దీక్షలో రాజేశ్వరి, సునీత, మంజుల, రాధిక, రమాదేవి, శ్రీలక్ష్మి, వందనశ్రీ, చిర్ర రాజు, భిక్షపతి, అరూరి సూర్యం, గజ్జల మల్లేష్, రవీందర్, నాగేశ్వర్‌రావు, సత్య జూల, కొమురయ్య, మంతని శంకర్, సాంబశివరావు, సాయిశరణ్, వెంకటగోపినాథ్ పాల్గొన్నారు. కాగా, దీక్షలకు జేఎన్టీయూ యూనివర్సిటీ నుంచి వెంకటేష్, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య సంఘీభావం తెలిపారు.

రైతుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

కాశిబుగ్గ: రైతుల సంక్షేమం, రైతును రాజు చేయాలనే ధ్యేయంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. రాజస్థాన్‌లో ప్రధాన మంత్రి మోదీ పీఎంకేఎస్‌కే ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు, ఫర్టిలైజర్ యజమానులతో కలిసి ఓ సిటీలోని క్యాంపు కార్యాలయంలో టీవీలో గురువారం వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంట పెట్టుబడి సాయం కింద ప్రతీరైతుకు పీఎం కిసాన్ కింద రూ.2 వేలను కేంద్రం జమ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే, పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితం చేసి, యూరియా గోల్డ్ పథకాన్ని ప్రారంభించారని వివరించారు.

కేవీకేలో కిసాన్ సమ్మాన్‌పై వెబ్‌క్యాస్ట్

కరీమాబాద్: మామునూరు కేవీకేలో గురువారం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ సమ్మేళనం 14వ విడత లైవ్ వెబ్‌క్యాస్ట్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ ప్రత్యక్ష కార్యక్రమాన్ని బీజేపీ నేతలు, కేవీకే శాస్త్రవేతలు, రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని వివరించారు. మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు ఏర్పాటుతో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు ఒకే చోట లభిస్తాయని పేర్కొన్నారు.

అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర

హన్మకొండ: అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర నిర్వహించనున్నట్లు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో కల్లుగీత కార్మిక సంఘం హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సామాజిక చైతన్య యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 2న బొల్లగాని పుల్లయ్య 35వ వర్ధంతి నుంచి 18న సర్వాయి పాపన్న 373వ జయంతి రోజు వరకు రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక చైతన్య యాత్ర నిర్వహించనున్నట్లు వివరించారు. అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలుపుతూ, కల్లుగీత వృత్తిలో ఉపాధి – ప్రత్యామ్నాయ మార్గాలను ప్రచారం చేస్తూ వేలాది మందికి సామాజిక చైతన్యం కల్పిస్తామని చెప్పారు. నర్సయ్య, రామస్వామి, రాజేష్, శివశంకర్, శ్రీనివాస్, రాజన్‌బాబు, గంగాధర్ పాల్గొన్నారు.